జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం



సోమవారం | 24 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 3


## చెస్ జాతీయ స్థాయి పోటీలకు డిఏవి విద్యార్థులు ఎంపిక




**సత్తుపల్లి, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి)** హైదరాబాద్ సమీపంలో గల బానూర్ డి ఏ వి పాఠశాల వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 చెస్ పోటీలలో సత్తుపల్లి మండలం బి గంగారం సాయి స్ఫూర్తి డిఏవి విద్యార్థులు వినుకొండ శ్రాగ్వీ, భవ్య శ్రీ లక్ష్మి,దేదీప్తి, సాత్విక జాతీయ చెస్ పోటీలకు ఎంపికైనారు. టీం కెప్టెన్ గా టీం ను జాతీయ స్థాయి లోకి తీసుకుపోయిన శ్రాగ్వీ ను పాఠశాల యాజమాన్యం చైర్మన్ దాసరి ప్రభాకర్ రెడ్డి గారు, ప్రిన్సిపల్ సాయి శ్రీ అభినందించారు. టీం విజయానికి బాటలు వేసిన శ్రాగ్వీ ను వారి తల్లిదండ్రులు సుజాత, వెంకటేశ్వరావు, పాఠశాల పిఈటి కుమార్, రామిశెట్టి, అనిత ప్రత్యేకంగా అభినందించారు.



# నమస్తే భట్టి సార్...
# నేను బోనకల్ ఫ్లై ఓవర్ ని!

- అంధకారంలో కనిపిస్తున్నాను
- నావల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి
- ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి
- నాపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు
- నాపై పరిశుభ్రత కూడా లేదు
- విద్యుత్ దీపాలు లేవు
- గుంతల మయంగా కనిపిస్తున్నాను
- నాపై విద్యుత్ లైట్లు, మెట్ల కొరత ఉన్నది
- ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు
- ఆర్ అండ్ బి అధికారులు కూడా నన్ను పట్టించుకోవడం లేదు
- జరా నా వైపు చూసి కనికరించండి భట్టి సార్

**బోనకల్, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):** నమస్కారం భట్టి సార్ నేను బోనకల్ ఫ్లై ఓవర్ ని, నన్ను నిర్మించిన దగ్గర నుండి ఇప్పటివరకు అంధకారంలోనే ఉన్నాను. నాపై ప్రయాణించే వాహనదారులకు ఏమి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆనాడు ఈ ఫ్లై ఓవర్ ను మీరే నిర్మించారు. గత పాలకులు నన్ను పట్టించుకోలేదు. మీ ద్వారా జరిగిన ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం మళ్లీ మీ ద్వారానే అభివృద్ధి జరుగుతుందని నేను అనుకుంటున్నాను. రాత్రిపూట నాపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. రాత్రిపూట ప్రయాణించే వారికి ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక తరచుగా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయి. కనీసం ఆర్ అండ్ బి అధికారులు కూడా నా వైపు కన్నెత్తి చూడడం లేదు. బాగా గుంతల మయంగా కనిపిస్తున్నాను. గుంతలమయంతో ఉన్న నన్ను కనీసం పట్టించుకునే అధికారులు కనిపించడం లేదు. విద్యుత్ దీపాలు లేక నాపై ప్రయాణించే వాహనదారులకు ఎదురెదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు బాగా జరుగుతున్నాయి. దీనికి తోడు నన్ను శుభ్రపరిచే అధికారులు కూడా నెలలో ఒక్క రోజైనా నా వైపు చూడటం లేదు. అసలు నన్ను పట్టించుకునే అధికారులు ఈ మండలంలో ఉన్నారా లేదా అనేది మండల ప్రజల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. నేను ఏం పాపం చేశాను. నన్ను నిర్మించి వదిలేశారు. నా వల్ల ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం గుంతల మయంగా కనిపిస్తున్న నేను విద్యుత్ దీపాలు లేక అంధకారంలోనే ఉండిపోవడమే ప్రధాన కారణం. అందుకే డిప్యూటీ సీఎం గా ఉన్న మీరు నన్ను పట్టించుకుంటారని మిమ్మలని వేడుకుంటున్నాను. నావల్ల ఎవరికి ప్రమాదాలు జరగకూడదని, ఎవరు ప్రాణాలు కోల్పోకూడదని బోనకల్ ఫ్లైఓవర్ గా ఉన్న నేను మిమ్ములను వేడుకుంటున్నాను భట్టి సార్.. నాకు ఇరువైపులా ప్రమాదాలు జరగకుండా రద్దీగా ఉండే ప్రదేశంలో రింగును ఏర్పాటు చేసి, మిగతా ప్రదేశంలో డివైడర్ ను వేయించ గలరని బోనకల్ ఫ్లైఓవర్ గా మిమ్ములను కోరుతున్నాను సార్.. అలా చేస్తే నావల్ల ఎటువంటి ప్రమాదాలు జరగవు భట్టి సార్... మీరు నిర్మించిన ఫ్లైఓవర్ కి మీరే అభివృద్ధి చేస్తారని బోనకల్ ఫ్లైఓవర్ గా ముక్తకంఠంతో కోరుతున్నాను.

## చొప్పకట్లపాలెంలో అభివృద్ధి పనుల అడ్డగింపు

- గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు
- కాంగ్రెస్ నాయకులు చేస్తేనే అభివృద్ధి అంట
- ప్రతిపక్షాలు చేస్తే అభివృద్ధి కాదంట
- గ్రామ కాంగ్రెస్ నాయకుల వైఖరిపై సర్పంచ్ అశ్విని, గ్రామస్తులు ఆగ్రహం



**బోనకల్, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి):** "ఇది రైతుల ప్రభుత్వం..రైతాంగానికి అండగా ఉండే పాలన" అని ప్రగల్భాలు పలుకుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం రైతుల పట్ల కొందరు గ్రామ నాయకుల వైఖరి అత్యంత దారుణంగా మారిందని చొప్పకట్లపాలెం సర్పంచ్ కాటేపల్లి అశ్విని, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ అశ్విని, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధి లోని చొప్పకట్లపాలెం గ్రామంలో పొలాలకు వెళ్లే మార్గాన్ని సుగమం చేసేందుకు గ్రామ పంచాయతీ చేపట్టిన ఉచిత మట్టి పనులను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులలో భాగంగా గ్రామంలోని కోతి గుడి వద్ద నుంచి చెరువు కట్ట వరకు ఉన్న రహదారి గత కొంతకాలంగా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి పూర్తిగా మూసుకుపోయిందని సర్పంచ్ తెలిపారు. అలాంటి మార్గాన్ని అభివృద్ధి చేస్తుంటే నాయకులు అడ్డుకోవడం సరికాదని సర్పంచ్ కాటేపల్లి అశ్విని, గ్రామ ప్రజలు వారిపై మండిపడ్డారు. గ్రామ ప్రజలు, రైతుల, వ్యవసాయ కూలీలు, రైతుల ట్రాక్టర్లు


మిగతా 2 లో...


## బోనమెత్తిన పల్లెలు...



**నేలకొండపల్లి, ఆగస్టు 23 ప్రజా జ్యోతి:** మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం బోనమెత్తారు. ముత్యాలమ్మ తల్లి పండగ ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల తో, కోలాటం, నృత్యాలతో సందడి చేశారు. బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి బోనాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాలలో కుటుంబ సభ్యులతో పాటు, బంధువులు రాకతో సందడి వాతావరణం నెలకొంది. వర్షాలు సమృద్ధిగా పడాలని... పాడి పంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని కొత్తకొత్తూరు గ్రామంలో బొడ్రాయి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా

- చిన్నారికి రూ.1.09 లక్షల సుకన్య సమృద్ధి డిపాజిట్



**కల్లూరు, ఆగస్టు 23 : ప్రజా జ్యోతి** మానవత్వానికి మించిన స్నేహం లేదని నిరూపిస్తూ పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన మేకల సూర్యకిరణ్ స్నేహితులు ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యకిరణ్ మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబానికి తమ వంతు అండగా నిలవాలని నిర్ణయించుకున్న స్నేహితులు సూర్యకిరణ్ కుమార్ భవిష్యత్తు కోసం రూ.1,09,000 లను సమకూర్చి సుకన్య సమృద్ధి పథకం కింద పిక్స్ డు డిపాజిట్ చేశారు. ఆదివారం స్నేహితులు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులతో కలిసి సూర్యకిరణ్ నివాసానికి వెళ్లి డిపాజిట్ కు సంబంధించిన బ్యాంకు ఖాతా పుస్తకాన్ని సూర్య కిరణ్ సతీమణి, మౌనిక కుమార్తె చిరంజీవి అభినయశ్రీకి అందజేశారు. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు చిన్నారి భవిష్యత్తుకు ఉపయోగపడేలా పొదుపు చేయడం పట్ల గ్రామస్తులు స్నేహితులను అభినందించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ స్నేహితులు మాట్లాడుతూ తమలో ఒకడిగా ఉంటూ ఎంతో ఆప్యాయంగా మెలిగే వాడిని స్నేహితుడిని కోల్పోవడం తమను తీవ్రంగా కలిచివేసిందని భావోద్వేగానికి లోనయ్యారు. తమ స్నేహితుడు ఇక తమ మధ్య లేకపోవడం ఎంతో విషాదకరమని కన్నీటి పర్యావంతమయ్యారు. కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ముఖ్యంగా అభినయశ్రీ భవిష్యత్తుకు తమ వంతు సహాయం అందించాలని ఉద్దేశంతోనే ఈ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. స్నేహితుడి జ్ఞాపకాలను సజీవంగా ఉంచడంతోపాటు కుమార్తె భవిష్యత్తుకు చిన్నపాటి భరోసా కల్పించాలని ఉద్దేశంతో చేసిన ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ వినయ్ కుమార్, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు గూడా రవి బాబు, మేకల లక్ష్మణ్, రామారావు, సురేష్, రాజేష్, శ్రీనివాస్ పసుపులేటి వెంకటేశ్వర్లు, వేము రాజేష్, రామారావు, నాగరాజు, అడవికట్ల డొమినిక్, యర్నం రాజు, గ్రామస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగరంగం వైభవంగా తీజ్ వేడుకలు





**నేలకొండపల్లి, ఆగస్టు 23 ప్రజా జ్యోతి:** మండలం లోని శంకర్ గిరి తండా లో ఆదివారం తీజ్ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. డీజే ఆటా, పాటలతో గిరిజన సాంప్రాదాయ వస్త్రాలతో నృత్యాలు చేశారు. మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ .....గ్రామంలో, అక్కా చెల్లెలు ఆడబిడ్డలు అన్నదమ్ములు సంస్కృతి సాంప్రదాయాల పండగ గతంలో లేని విధంగా ఎంతో ఆనందంగా ముగింపు సందర్భంగా దేవాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. పంచాయతీ సర్పంచ్ ధరావత్ దీప్లా సరోజిని దంపతులు అమ్మవారికి వస్త్రాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. గిరిజనుల సంబురాలు అంబరాన్నింటాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలపై దాడి..




- **లేబర్ కోడ్ లపై ఏఐటీయూసీ పోరుబాట**
- **మహాసభలతో హోరెత్తిన కార్మిక ప్రదర్శన**

**సత్తుపల్లి ఆగస్టు23(ప్రజా జ్యోతి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు.ఖమ్మం జిల్లా 17వ మహాసభల సందర్భంగా ఆదివారం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సెమినార్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుండి మహాసభల ప్రాంగణం వరకు బారీ కార్మిక ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం లక్ష్మి ప్రసన్నలో జరిగిన సదస్సులో నరసింహ మాట్లాడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలు తీసుకురావడంతో శ్రామికుల శ్రమ మరింత దోపిడికి గురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనధికారికంగా రోజుకి 10 నుండి 16 గంటలు పని చేయించుకుంటున్నారని, రేపు ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగిస్తే కార్మికుల జీవితాలు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వాలు కార్మికులకు ఏ చట్టాన్ని దయతోనో వారి సంక్షేమం కొరకు ఇవ్వలేదని కార్మిక చట్టాలు కేవలం కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన హక్కులన్నారు. కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ విధానాల వల్ల ప్రస్తుతం సంఘటిత రంగంలో కూడా అసంఘటితరంగాన్ని తలపించేలా వేతనాలు ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత, పని గంటలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై లేబర్ కోడ్ లు ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు తాము కనీస వేతనాలు నెలకు రూ. 26వేలు ఇవ్వాలని పోరాటాలు చేస్తుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేతనాలు తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక వైపు బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూనే మరొకవైపు ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 10 గంటల పని విధానం తీసుకురావటం బాధాకరమైన విషయమని మండిపడ్డారు.సోమవారం జరిగే మహసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు బాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్.షాబీర్ పాషా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని కావునా సిపిఐ నాయకులు,కార్యకర్తకు,సానుభూతిపరులు బారీగా హజరై జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జి. క్లెమెంట్ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, జిల్లా కార్యదర్శి టి. రామాంజనేయులు జిల్లా ఉపాధ్యక్షురాలు సీతా మహాలక్ష్మి, వేము రాంబాబు, మహాదేవ లక్ష్మి, జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ బి.కే.ఎం.యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ సింగరేణి ఏఐటీయూసీ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు తడికమళ్ల యోబు, రంజాన్ బీ, మున్సిపల్ నాయకులు ఊడల కృష్ణమూర్తి, వజీర్ మియా, టి. లక్ష్మి, సత్తుపల్లి, సుధాకర్, కార్యదర్శి శ్రీనివాసరావు, మలైకా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రామారావు తెలగారపు,తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు కంచి శ్రీను ,నాయకులు వల్లెపు శ్రీను, పోలేటి వెంకటేశ్వరరావు, వేంసూరు ఎండీఎం అధ్యక్షురాలు మిట్టపల్లి సత్యావతి, పిల్లి బుచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

# చొప్పకట్లపాలెంలో అభివృద్ధి పనుల అడ్డగింపు

(మొదటి పేజీ తరువాయి...)

పొక్లెయిన్లు, పొలాలకు వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఇటీవల జేసీబీ, కూలీలతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టి రోడ్డును అందుబాటులోకి తెచ్చింది. పంచాయతీ చూపించిన చొరవపై రైతులు, స్థానిక గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. తమ శక్తి మేరకు గ్రామ అభివృద్ధి పనులు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేస్తుండటంతో అది తట్టుకోలేని కాంగ్రెస్ నాయకులు ఏదో ఒక పేరు తోటి గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చేస్తేనే అది అభివృద్ధి అంట ప్రతి పక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులు చేస్తుంటే అవి అభివృద్ధి పనులు కావంటూ కాంగ్రెస్ నాయకులు అధికారం పేరుతో చీటికి మాటికి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.



**» ఓర్వలేక మట్టి తోలకాన్ని నిలిపివేసిన నాయకులు**

వర్షా కాలం దగ్గర పడుతుండటంతో, రోడ్డు మరింత గుంతలమయం కాకుండా ఉండటానికి పంచాయతీ పాలకవర్గం సొంత నిధులతో మట్టిని తోలించే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అయితే, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని కొందరు గ్రామ కాంగ్రెస్ నాయకులు మట్టి తోలకుండా అధికారం పేరుతో మండల అధికారులను అడ్డం పెట్టుకొని నిలిపివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు."రైతుల కష్టాలు తీరుతుంటే ఈ రాజకీయ కక్షలేంటి? "ఏళ్ల తరబడి రోడ్డు లేక తాము అల్లాడిపోయామని గ్రామ ప్రజలు ఆవేదన ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామ ప్రజల ఇబ్బందులు ఆవేదనను అర్థం చేసుకొని గ్రామపంచాయతీ స్పందించి బాట వేస్తుంటే, ఓర్వలేక రాజకీయాలు చేస్తూ పనులు ఆపడం ఎంతవరకు సమంజసం? అంటూ ఆమె కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. రైతులకు మేలు జరుగుతుంటే అడ్డుపడటం దారుణం" అని గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాజకీయ స్వార్థం కోసం రైతుల ఉపాధిని, గమనాన్ని దెబ్బతీయడం దారుణమని, వెంటనే జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని అభివృద్ధి పనులకు మట్టి పనులను పునరుద్ధరించాలని చొప్పకట్లపాలెం రైతాంగం, ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే 7 వేలకే నోటిఫికేషనా


- ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి
- ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్




**నేలకొండపల్లి, ఆగస్టు 23 ప్రజా జ్యోతి** : రాష్ట్రంలో సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ అన్నారు. ఖాళీగా ఉన్న అన్ని కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. వేలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా పరిమిత సంఖ్యలో పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు ఇవ్వడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.ప్రతి సంవత్సరం సుమారు 9 వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నప్పటికీ, ఆ స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులన్నింటినీ గుర్తించి, ఒకేసారి నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం యువత లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన విమర్శించారు. కేంద్రంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు, నిరుద్యోగులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.యువత, నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు శీలం సిద్ధారెడ్డి

- ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ప్రాంతానికి చెందినశీలం సిద్ధారెడ్డి ప్రజా సేవలో సుదీర్ఘకాలం కొనసాగరని ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర మంత్రిగా పనిచేసిన తొలి నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందనీ నిజాం వ్యతిరేక పోరాట సమయంలో ఎర్రుపాలెం మండలంలోని గోసవీడు క్యాంపులో ఉద్యమకారులకు శిక్షణ అందించడంలో శీలం సిద్ధారెడ్డి కీలక పాత్ర పోషించినట్లు స్థానిక చారిత్రక సమాచారం పేర్కొంటోంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన ఆయన అనంతరం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల నాయకుడిగా ఎదిగారు.1967లో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శీలం సిద్ధారెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన తొలి మంత్రిగా చరిత్రలో నిలిచారు. ఆయన 1960 నుంచి 1970 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు.తర్వాత మధిర నియోజకవర్గ రాజకీయాల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. 1983లో మధిర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అధికారిక 1983 ఎన్నికల గణాంకాల్లో శీలం సిద్ధారెడ్డి మధిర ఎమ్మెల్యేగా నమోదయ్యారు.ఎమ్మెల్యేగా పనిచేసిన అనంతరం శాసనమండలి సభ్యుడిగా ఎన్నికై, కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నరసింహారావు మంత్రివర్గాల్లో మంత్రిగా సేవలందించారు అని మధిర నియోజకవర్గ చరిత్రపై ప్రచురితమైన సమాచారం పేర్కొంటోంది.ప్రత్యేకంగా నీటిపారుదల శాఖ మంత్రిగా శీలం సిద్ధారెడ్డి పనిచేసినట్లు పలు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. మధిరకు చెందిన నాయకుడిగా రాష్ట్రస్థాయిలో మంత్రి పదవిని చేపట్టడం ఆ ప్రాంతానికి అప్పట్లో అరుదైన గౌరవంగా నిలిచింది.శీలం సిద్ధారెడ్డి రాజకీయ జీవితం కేవలం పదవులకే పరిమితం కాలేదు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని మాజీ మంత్రులు, రాజకీయ ప్రముఖులు ఆయన వర్ధంతి సందర్భంగా సుధాకర్ రెడ్డి ఆయనను గుర్తుచేసుకున్నారు.2011 డిసెంబరు 26న శీలం సిద్ధారెడ్డి కన్నుమూశారు. ప్రజా సేవ, కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధత, రాజకీయాల్లో క్రమశిక్షణతో ఆయన సాగించిన ప్రస్థానం మధిర, ఖమ్మం జిల్లా రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయింది.మధిర రాజకీయ చరిత్రను ప్రస్తావించిన ప్రతిసారి గుర్తుకొచ్చే పేర్లలో శీలం సిద్ధారెడ్డి ఒకరు. ప్రజా సేవకు అంకితమైన ఆయన రాజకీయ ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు గ్రామ సర్పంచ్ బలుసుపాటి జయరాజు ఉపసర్పంచ్ వేమిరెడ్డి రామిరెడ్డి ప్రముఖ లాయర్ శీలం చెన్నారెడ్డి, వాసంశెట్టి కోటేశ్వరరావు, పత్తేపురపు సంగయ్య, షేక్ జాకీర్ హుస్సేన్,అనుమోల కృష్ణారావు గుటేటి బాబురావు, దేవరకొండా రాజీవ్ గాంధీ, ఉపసర్పంచు వేమిరెడ్డి రామిరెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, కుడుముల వెంకటరామిరెడ్డి, యన్నం సత్యనారాయణ రెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ బొగ్గుల వీరారెడ్డి, ఎదురు కృష్ణరెడ్డి, బోగ్గుల రాంచంద్రారెడ్డి, గొట్టేముక్కుల సత్యనారాయన రెడ్డి, చెట్టుపల్లి సరోజినీ, ఖమ్మంపాటి లక్ష్మణరావు,వేమిరెడ్డి విజయరెడ్డి,వీసం సంతోష్, పొట్టేటి రవి, కర్నాటి మాధవరెడ్డి, దండమూరి రవి, కురిచేపల్లి శరభలింగం కాంగ్రెస్ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జమలాపురంలో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మకు బోనాలు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో శ్రావణ మాసం సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి కి బోనాల వేడుకలు ఆదివారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నుండి ముత్యాలమ్మ అమ్మవారికి ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పట్టు వస్త్రములు గాజులు పూలు పండ్లు ప్రసాదములు తీసుకుని వచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని గ్రామస్తులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మల కుమారి ఖమ్మం ఏఎన్నార్ గ్రానైస్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు వేడుకల్లో పాల్గొని అమ్మవారికి బోనాలు,పట్టు వస్త్రములు, ప్రసాదములు సమర్పించారు. గ్రామం అంతా ఆడబిడ్డలతో ముత్యాలమ్మ ఆలయం పండుగ వాతావరణం నెలకొంది. గ్రామం అంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లికి పసుపు –కుంకుమ, పూలు ,పండ్లు,గారెలు సమర్పించారు.గత మూడు రోజుల నుండి గ్రామస్తులు ప్రతి ఇంటి నుండి ముత్యాలమ్మకు జలబిందెలతో జలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు–నిర్మల కుమారి దంపతులు ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో వర్షాలు బాగా కురవాలని, గ్రామం అంతా సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని,రైతులు సంతోషంగా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో వెల్లి విరియాలని అమ్మవారిని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు యువకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధన వేడుకలు

- బంజారా సాంప్రదాయ పద్ధతులు సేవాలాల్, మేరమా యాడికి ప్రత్యేక పూజలు



**బోనకల్, ఆగస్టు 23(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని రావినూతల గ్రామంలో బడి తండా లో బంజారా సమాజ ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి ఆరాధన వేడుకలను ఆదివారం తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

**సేవాలాల్ మహారాజ్ కు భోగ్–హోమం..**

సేవలాల్ మహారాజ్ చిత్రపటం ముందు సంప్రదాయ పద్ధతిలో భోగ్, హోమ కార్యక్రమాలను నిర్వహించి, నెయ్యితో బియ్యం, పాయసం తదితర ప్రసాదాలను హోమాగ్నికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్యం, సుఖశాంతులు, పంటల సమృద్ధి, పశుసంపద అభివృద్ధి కలగాలని ప్రార్థించారు.

**మేరమా యాడి ఆరాధన...**

బంజారా సంప్రదాయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మేరమా యాడికి తండా ప్రజలు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఆచార సంప్రదాయం ప్రకారం మేకలను బలి సమర్పించి, అనంతరం ప్రసాదంగా స్వీకరించారు.ఈ సందర్భంగా తండా పెద్దలు మాట్లాడుతూ... సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక గురువుగా, మార్గదర్శకుడిగా, సన్మార్గం, సేవ, ఐక్యత, జీవుల పట్ల కరుణకు ప్రతీకగా భావించబడుతున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ కు నిర్వహించే భోగ్–హోమ నైవేద్యం, మేరమా యాడికి నిర్వహించే సాంప్రదాయ ఆరాధన బంజారా సమాజంలోని ప్రత్యేక ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో తండా నాయక్, కార్బారి, తండా పెద్దలు, యువత, మహిళలు, పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో రావినూతల బడి తండా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, బంజారా సంస్కృతి–సంప్రదాయాలు తరతరాలకు కొనసాగాలని ఆకాంక్షించారు.

# కలకోటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**బోనకల్, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):** మండలంలోని కలకోట గ్రామంలో నూతన రేషన్ కార్డులు, స్మార్ట్ కార్డులను టీపీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ కార్డుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సర్పంచ్ పైడిపల్లి అనిత, ఉపసర్పంచ్ కొత్తగుండ్ల వేణు, పాలక మండలి సభ్యులు తోటపల్లి సువార్త, యంగల కృష్ణవేణి, మాతంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు తోటపల్లి కోటయ్య, వెంగళ మోహన్‌రావు, గ్రామ పరిపాలన అధికారి జంగాల శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ గుమస్తా తదితరులు పాల్గొన్నారు.

